# నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్-నిర్మల్

5 | నిజామాబాద్ ఆదివారం 14 జూలై 2024 | ADILABAD NIRMAL




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

## అభిప్రాయ సేకరణ పేరిట మోసం

**అర్హులైన రైతులకు రైతుభరోసా అందించాలి**

- డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలి
- మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, జూలై 13(నమస్తే తెలంగాణ) : ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుభరోసా పథకంలో భాగంగా ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయం అందించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఈ పథకం అమలులో రైతుల అభిప్రాయాల సేకరణ పేరిట మోసం చేయాలని చూస్తున్నదన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శుల వద్ద వివరాలు సేకరించి సాగు చేస్తున్న రైతులకు సాయం అందించాలని సూచించారు. ఇటీవల ఉట్నూర్‌లో నిర్వహించిన అభిప్రాయ సేకరణ కాంగ్రెస్ కార్యకర్తలకు మాట్లాడే అవకాశం ఇచ్చారన్నారు. రైతు సంఘాల నాయకులు, ఇతర రైతులకు మాట్లాడే అవకాశం కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ గదిలో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారని, రైతులు లోపలికి పోయే అవకాశం లేకపోవడంతో బయట నిల్చోవాల్సి వచ్చిందన్నారు. పథకం అమలులో ఆంక్షలు లేవని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అంటున్నారని, అలాంటప్పుడు అభిప్రాయ సేకరణ ఎందుకు చేయాల్సి వచ్చిందో మంత్రివర్గ ఉప సంఘం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**200 రోజులు దాటినా గ్యారెంటీలకు దిక్కులేదు..**

ఎన్నికల సమయంలో వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 200ల రోజులు గడిచినా పథకాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రూ.2 లక్షల రుణమాఫీ విషయంలో దేవుళ్లపై ఓట్లు పెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు రూ.12 వేల సాయం, చేయూత పింఛన్లు ఎందుకు అందించడం లేదన్నారు. గృహజ్యోతి, రూ.500 సిలిండర్, పంటలకు బోనస్, యువ వికాసం పథకాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు లేవని, ఇటీవల పదవీకాలం ముగిసినా జడ్పీటీసీ, ఎంపీటీసీలకు ఆరు నెలలుగా గౌరవ వేతనాలు అందడం లేదన్నారు. డీఎస్సీ, గ్రూప్-2 పరీక్షలు వాయిదా వేయాలని, నిరుద్యోగులు ఆందోళనలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. రెండు పరీక్షలు వాయిదా వేసి వారికి న్యాయం చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే, రాబోయే రోజుల్లో ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ప్రహ్లాద్, సాజీదొద్దీన్, విజ్జిగిరి నారాయణ, శ్రీనివాస్, రమేశ్, జగదీశ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

## నాలుగు ప్రైవేట్ ట్రావెల్ బస్సులు సీజ్




సీజ్ చేసిన ట్రావెల్ బస్సులు

ఎదులాపురం, జూలై 13 : నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న నాలుగు ప్రైవేట్ ట్రావెల్ బస్సులను శనివారం ఉదయం ఆర్టీవో అధికారులు సీజ్ చేశారు. జిల్లా రవాణా శాఖ అధికారి శివపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏఎంవీఐ హరీంద్రకుమార్ సిబ్బందితో కలిసి ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కాళేశ్వరి, డైమాండ్, సహార, ముస్కాన్ లక్కీ ట్రావెల్ బస్సులను సీజ్ చేసి ఆర్టీసీ డిపోకు తరలించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని డీటీవో తెలిపారు.



ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాగూడలో సోయాబిన్ పంట

## ఆశల సాగు

- అనుకూలిస్తున్న వర్షాలు
- 5.20 లక్షల ఎకరాల్లో పంటలు

ఆదిలాబాద్, జూలై 13(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో వానకాలం పంటలు ఆశాజనకంగా ఉండడంతో రైతులు దిగుబడులపై ఆశలు పెట్టుకున్నారు. ఈ సీజన్‌లో అధికంగా పత్తి, సోయాబిన్, కంది పంటలు వేశారు. జిల్లాలో అధికంగా రైతులు వర్షాలపై ఆధారపడి వానకాలం పంటలు సాగు చేస్తారు. ఈ సీజన్‌లో 5.20 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో అధికంగా పత్తి పంటను 3.80 లక్షల ఎకరాల్లో పండిస్తున్నారు. జూన్ మొదటి, రెండో వారంలో రైతులు విత్తనాలు వేయగా వానలు సరిగా పడకపోవడంతో ఆందోళన చెందారు. చివరకు వరుణుడు కరుణించడంతో రైతులు పంటలు నష్టపోయే ప్రమాదం నుంచి బయట పడ్డారు. ఆ తర్వాత వర్షాలు క్రమంగా పడడంతో పంటలు ఏపుగా పెరుగుతున్నాయి. పంటలు బాగా పెరగడానికి రైతులు కలుపు ముందులు చల్లుతున్నారు.

**సాధారణ వర్షపాతం నమోదు**

జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం నమోదైంది. సీజన్‌లో ఇప్పటి వరకు 357.3 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, 321.3 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఆదిలాబాద్ అర్బన్, ఆదిలాబాద్ రూరల్, గుడిహత్నూర్, ఉట్నూర్, తాంసి మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షం పడింది. భారీ వర్షాలు పడకపోవడంతో ప్రాజెక్టులు, చెరువుల్లోకి నీరు అంతగా చేరలేదు. భూగర్భ జలమట్టం కూడా పైకి రాలేదు. జిల్లాలోని రైతులు ఎక్కువగా సాగు చేసే పత్తి, సోయాబిన్, కంది పంటలు ఇప్పటి వరకు బాగా ఉన్నా సీజన్‌లో పూర్తిస్థాయి వర్షాలు పడితేనే పంటలు బాగా పండుతాయని రైతులు అంటున్నారు. ప్రాజెక్టులు, చెరువుల్లోకి నీరు చేరితే భూగర్భజాలలు కూడా పెరుగుతాయని, యాసంగి సాగు చేసుకోవచ్చని చెబుతున్నారు.

## అధికారులతో కలెక్టర్ సమీక్ష

ఎదులాపురం, జూలై 13 : ప్రజాపాలన, ధరణి, వ్యవసాయం, వైద్యం, వనమహోత్సవం, మహిళా శక్తి, విద్య, యాంటి డ్రగ్స్, శాంతి భద్రతలపై శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజర్షి షా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయా శాఖలవారీగా వివరాలు, పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

## వివాహిత ఆత్మహత్యాయత్నం

నిర్మల్ అర్బన్, జూలై 13 : నిర్మల్‌లోని బంగల్‌పేట్ కాలనీలో గల వినాయక్ సాగర్‌లో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతుందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి పోలీసులు చేరుకకుని ఆమెను రక్షించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడడానికి కారణాలను అడుగగా మహారాష్ట్రలోని బీదర్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ భర్త సంవత్సరం క్రితం చనిపోయాడు. ఆమెకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఖానాపూర్‌లో నివసించే అతనితో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం మహాలక్ష్మి వాడలోని డబుల్ బెడ్రూం ఇండ్లలో నివసిస్తున్నారు. కుటుంబ కలహాలతో శనివారం బంగల్‌పేట్ చెరువులో దూకేందుకు అక్కడికి చేరుకుంది. కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి మహిళను అప్పగించారు. మహిళను కాపాడిన బ్లూకోట్ సిబ్బందిని డీఎస్పీ గంగారెడ్డి, పట్టణ సీఐ ప్రవీణ్ అభినందించారు.



చెక్‌డ్యాం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

## చెక్‌డ్యాం పనుల పరిశీలన

నేరడిగొండ, జూలై 13 : మండలంలోని కొర్టికల్ శివారులో నూతనంగా నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనులను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ శనివారం పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలన్నారు. ఇందులో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నానక్ సింగ్,ఇస్పూర్ మాజీ సర్పంచ్ జాదవ్ రమేశ్, ప్రతాప్‌సింగ్, గులాబ్‌సింగ్ ఉన్నారు.

## విద్యుత్ కోతలపై రైతు ఆందోళన

- మెట్‌పెల్లి ప్రధాన రహదారిపై బైఠాయింపు
- వడ్లను రహదారికి అడ్డంగా పోసి నిరసన
- స్తంభించిన రాకపోకలు
- పోలీసుల జోక్యంతో ఆందోళన విరమణ

ఖానాపూర్ రూరల్, జూలై 13 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ గ్రామానికి చెందిన రైతు తునికి రమేశ్ విద్యుత్ కోతలను నిరసిస్తూ శనివారం రోడ్డుపై బైఠాయించాడు. రమేశ్‌కు సుర్జాపూర్‌లో ఐదెకరాల వ్యవసాయ భూమి ఉంది. వానకాలంలో వరి సాగు చేయాలని భావించాడు. ఇందుకోసం ఇప్పటికే నాలుగెకరాల్లో వరి వేశాడు. చివరి ఎకరం భూమిలో నాటు వేయడానికి మూడు రోజుల క్రితం వడ్లను నానబెట్టాడు. మొలకలు రావడంతో శనివారం పొలం వద్దకు తీసుకెళ్లాడు. మొలకలను విప్పి చల్లడానికి సిద్ధమై కరెంటు మోటారు వేశాడు. కరెంటు లేకపోవడంతో దగ్గరలోనే సబ్ స్టేషన్ ఉండడగా ఉదయం 8 గంటల వరకు వెళ్లాడు. అక్కడ సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, లైన్‌మన్ అంకం నరేశ్ ఉన్నారు. అధికారులను కరెంటు ఎప్పుడొస్తుందని అడిగాడు. ఇప్పుడే రాదని వచ్చినపుడే విత్తనాలు చల్లుకోవాలని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. కరెంట్ ఇవ్వం.. ఏం చేసుకుంటావో చేసుకోమని అధికారులు అన్నారని పేర్కొన్నాడు. అప్పటికే మధ్యాహ్నం 2 గంటలు అవుతున్నది. ఇప్పుడు కరెంటు రాకపోతే విప్పిన మొలకలు పనిచేయవని ఆందోళన చెందాడు. సుర్జాపూర్ గ్రామ చౌరస్తాలో గల మెట్‌పల్లి రహదారికి అడ్డంగా వడ్లు పోసి బైఠాయించాడు. దాదాపు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు రోడ్డుపైనే కూర్చొని నిరసన తెలిపాడు. దీంతో రహదారికి రెండు వైపులా వాహనాలు నిలిచాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ధర్నా చేస్తున్న ప్రాంతానికి చేరుకుని రైతును సముదాయించారు. రైతును సబ్ స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. రెండు ఎడ్లు, ఒక కూలిని రూ.4 వేలకు మాట్లాడుకుని తీసుకొచ్చుకున్నాను. మొలకలు కూడా వట్టి పోయి పనికిరాకుండా పోయే పరిస్థితి ఉందని రైతు ఆవేదన చెందాడు. ఈ క్రమంలో సాయంత్రం 4.30 గంటలకు అధికారులు కరెంటు ఇచ్చారు. దీంతో రైతు ఇంటికి వెళ్లిపోయాడు. పోలీసులు విద్యుత్ అధికారులకు కూడా కరెంటు కోతలు విధించేటప్పుడు రైతులకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని సూచించి వెళ్లిపోయారు.



మెట్‌పెల్లి ప్రధాన రోడ్డుపై బైఠాయించిన రమేశ్‌ను సముదాయిస్తున్న పోలీసులు

**విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉందని ముందే చెప్పాం**

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉందని ప్రెస్‌నోట్‌ను ఒక్క రోజు ముందే రిలీజ్ చేసినట్లు విద్యుత్ శాఖ ఏడీఈ కె.శ్రీనివాస్, ఎస్‌ఏఎం వెంకటరమణ పేర్కొన్నారు. ఇది తెలియక తునికి రమేశ్ విద్యుత్ కొత విధించారని రోడ్డుపై ధర్నా చేసి ఆందోళన చేసినట్లు తెలిపారు. నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నిర్మల్ జిల్లా వ్యాప్తంగా విద్యుత్ సరఫరాను అందించే అక్కాపూర్ 220 కేవీ సబ్‌స్టేషన్‌లో ప్రధాన లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టడంతో అంతరాయం కలిగిందన్నారు.



గర్భిణి పంద్ర శ్రీదేవి గురించి తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

## గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి

- విచారణ నివేదికలు కలెక్టర్‌కు అందిస్తాం
- డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఇంద్రవెల్లి, జూలై 13 : మారుమూల గ్రామాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు చెందిన గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలని, చిత్తబట్ట నుంచి గౌరాపూర్ వరకు కాలినడకన వచ్చిన గర్భిణీ ఫంద్ర శ్రీదేవి గురించి చేపట్టిన విచారణ నివేదికలను కలెక్టర్‌కు అందిస్తామని డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. శనివారం మండలంలోని ధనోరా(బీ) గ్రామంలోని ఆరోగ్య ఉప కేంద్రంలో సంబంధిత వైద్యులతోపాటు ఏఎన్ఎంలు, ఆశ వర్కర్‌తో విచారణ చేపట్టారు. ఆశ కార్యకర్త కనక లక్ష్మితోపాటు వైద్య సిబ్బంది మాట్లాడుతూ.. రోడ్డు సౌకర్యం సరిగా లేకపోవడం, మధ్యలో వాగు ఉండడంతో గ్రామానికి అంబులెన్స్ రావడానికి ఇబ్బందిగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. విచారణలో గుర్తించిన వివిధ రకాల అంశాలు, రోడ్డు సమస్యలు, వాగుపై వంతెన లేకపోవడంతో వస్తున్న సమస్యలపై కలెక్టర్‌కు నివేదికలు అందిస్తామని తెలిపారు.

## చెట్టును ఢీకొన్న కారు.. బాలుడి మృతి

- కానిస్టేబుల్‌తో పాటు భార్య, తల్లికి తీవ్ర గాయాలు
- బర్త్ డే ఫంక్షన్‌కి వెళ్లి వస్తుండగా ప్రమాదం



చికిత్స పొందుతున్న బాలుడి తల్లి గీత, నానమ్మ జీజాబాయి



జాదవ్ జైసన్‌రాజ్ (ఫైల్)

జన్నారం/ఉట్నూర్, జూలై13 : బర్త్‌డే వేడుకలకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు జాదవ్ జైసన్‌రాజ్(10) మృతి చెందగా మరో ముగ్గురి గాయాలైన విషాద ఘటన మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని తొమ్మిదిగుడిసెలపల్లె వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. జన్నారం ఎస్ఐ రాజవర్ధన్, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..ఆదిలాబాద్ జిల్లా లింగాపూర్ మండలం కొత్తపెల్లి(చిక్కులగూడెం)కు చెందిన కానిస్టేబుల్ జాదవ్ గోపిచంద్ నార్నూర్ సీఐ వద్ద గన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం మంచిర్యాల జిల్లా మందమర్రిలో అతని బంధువుల ఇంట్లో పుట్టినరోజు వేడుకలకు హాజరై అర్ధరాత్రి ఇంటికి కారులో తిరిగి వస్తుండగా అడ్డుగా వచ్చిన పశువులను తప్పించబోయి చెట్టును ఢీకొన్నాడు. కారు నుజ్జునుజ్జుకావడంతో అందులో కుమారుడు జైసన్‌రాజ్ ఇరుక్కపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. గోపిచంద్‌తో పాటుగా అతని తల్లి జీజాబాయి, భార్య గీతకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వచ్చి వారిని మంచిర్యాల దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుల బంధువు జాదవ్ భాంరావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల జిల్లా దవాఖానకు తరలించారు. బాలుడి మృతితో కొత్తపెల్లి గ్రామంలో విషాదం నెలకొన్నది.



గోండ్‌గూడ, ప్రధాన్‌గూడలో కొలువుదీరిన పీరీలు

## మొహర్రం సందడి

ఇంద్రవెల్లి, జూలై 13 : మండలంలోని ఆయా గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలు ఈ నెల 8న ప్రారంభమయ్యాయి. శనివారం గోండ్‌గూడ, ప్రధాన్‌గూడ గ్రామాల్లో డోలాతో పాటు పీరీలను యువత రంగురంగుల కాగితాలతో అలంకరించారు. గోండ్‌గూడ, ప్రధాన్‌గూడ గ్రామాల్లో పీరీలను భక్తులు శుక్రవారం వైభవంగా ఏర్పాటు చేశారు. ఈ నెల 8వ తేదీన ప్రారంభమైన పండుగ 18వ తేదీ వరకు కొనసాగుతుందని భక్తులు పేర్కొన్నారు. పీరీల ఉత్సవాల్లో ఉపయోగించే నెమలి ఈకలను కొంతమంది భక్తులు కొనుగోలు చేశారు. గ్రామాల్లో కొలువుదీరిన పీరీల వద్ద భక్తులతోపాటు గ్రామస్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పీరీల గుండాల వద్దకు భక్తులు రాత్రివేళల్లో డప్పుచప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ సందడి చేస్తున్నారు. దీంతో ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో పీరీల ఉత్సవాలతో సంబురాల వాతావరణం ఏర్పడింది. మొహర్రం ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీ జగన్నాథ రథయాత్ర

*ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని మధుర జినింగ్ నుంచి శనివారం భక్తులు శ్రీ జగన్నాథ రథయాత్రను ప్రారంభించారు. ప్రధాన కూడళ్ల గుండా రథయాత్ర కొనసాగింది. చిన్నారులు సీతారాములు, లక్ష్మణుడు, హనుమంతుడు, శ్రీ జగన్నాథుని వేషధారణలో అలరించారు. భక్తి గీతాలపై యువకులు నృత్యాలు చేశారు.*

*- ఎదులాపురం /ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, జూలై 13*



ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని గాంధీ చౌక్‌లో శ్రీ జగన్నాథ రథయాత్రలో పాల్గొన్న భక్తులు

## పీడీఎస్ బియ్యం పట్టివేత

జైనథ్, జూలై 13 : కామాయి ఎక్స్ రోడ్డు వద్ద శనివారం ఎస్సై పురుషోత్తం తన సిబ్బంది సిరాజ్, శివాజీ, లింగమూర్తితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో మూడు ఆటోల్లో ఆదిలాబాద్‌లో సేకరించిన పీడీఎస్ బియ్యాన్ని మహారాష్ట్రలోని బోరి గ్రామానికి చెందిన జావిద్‌కు విక్రయించడానికి తీసుకెళ్తున్నారు. సుమారు 16.5 క్వింటాళ్ల బియ్యాన్ని, వాహనాలను సీజ్ చేశారు. వీరిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. పోలీసులను ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి అభినందించారు.



పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఆటోలతో పోలీసులు

**బేల మండలంలో..**

జైనథ్(బేల), జూలై 13 : బేల మండలంలోని ఏఎస్సై జీవన్ కుమార్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా బోల్లెరో మాక్స్ పికప్ అనే వాహనంలో బేల మండలానికి చెందిన షేక్ షేబాజ్ సుమారు 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. మండలానికి చెందిన వాసింతో కలిసి ఈ బియ్యాన్ని మహారాష్ట్రలోని బోరి గ్రామానికి చెందిన జావిద్‌కు అమ్మడానికి తీసుకువెళ్తున్నట్లు విచారణలో తేలింది. సుమారు 20 క్వింటాళ్ల బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేశారు. వీరిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడిన ఉపేక్షించేంది లేదని జైనథ్ సీఐ డి.సాయినాథ్ తెలిపారు. బేల ఏఎస్సై జీవన్ కుమార్, లింగయ్య, బేల పోలీస్ సిబ్బంది గిరి, రమేశ్, విఠల్‌ను ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి అభినందించారు.